క్లుప్తంగా

నేడు వైద్య శిబిరం

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మలో శనివారం మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. శుక్రవారం ఆయన పోలీస్‌స్టేషన్‌లో విలేకరుతో మాట్లాడారు. ఆదిలాబాద్, ఇతర ప్రాంతాల వైద్యులు వైద్య పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. సిరిచెల్మ చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంపు తర్వాత దుప్పట్ల పంపిణీ చేస్తామన్నారు. ముఖ్య అతిథిలుగా ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్, తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు.

వాగ్ధారిలో వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: మండలంలోని వాగ్ధారి గ్రామంలో శుక్రవారం సికిల్‌సెల్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఈవో పవార్ రవీందర్ మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనీమియా ప్రాణాంతకమైన వ్యాధి అన్నారు. వ్యాధి సోకిన వారికి నిర్ణీత సమయంలో రక్తం ఎక్కించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వాణి, హెల్త్ అసిస్టెంట్ నరేందర్ రెడ్డి, ఏఎన్ఎం గంగామణి, శ్యామల, ఆశ కార్యకర్త వనిత, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



అంగన్‌వాడీని తనిఖీ చేస్తున్న సీడీపీవో

నార్నూర్: అంగన్‌వాడీ కేంద్రం ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని సీడీపీవో శారద అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జీన్‌గూడ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా అయ్యే సరకుల్లో నాణ్యతను పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని సూచించారు. ఆమె వెంట పంచశీల, అంగన్‌వాడీ టీచర్, తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన పూర్వ వీఆర్‌వోలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీఆర్‌వోలు

కైలాస్‌నగర్: పూర్వ గ్రామ రెవెన్యూ అధికారులు జిల్లా కలెక్టర్ రాజర్షి షాను శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటి, ఉపాధ్యక్షుడు వామన్ రావు, అరుణ, ఆహల్య, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెక్కు అందజేత

బేల: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాదారుడు చౌహాన్ లవకుశ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన పథకం క్రింద ప్రీమియం చెల్లించాడు. ఇటీవల ఆయన అనారోగ్యంతో చనిపోవడంతో శుక్రవారం బాధిత కుటుంబసభ్యులకు చౌహాన్ దేవికబాయికి రూ.2లక్షల బీమా పరిహారం చెక్కును మేనేజర్ బొంత అశోక్ అందజేశారు. కార్యక్రమంలో క్యాషియర్ రామారావు, సిబ్బంది సంజయ్, ప్రమోద్, సాగర్ పాల్గొన్నారు.

భక్తిమార్గంలో నడవాలి

ఆదిలాబాద్: ప్రతిఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గత కొన్ని రోజులుగా ఆదిలాబాద్ పట్టణంలోని డైట్ కళాశాల మైదానంలో జరుగుతున్న విశ్వశాంతి మహా యాగాన్ని శుక్రవారం సందర్శించారు. యాగం నిర్వహిస్తున్న స్వామీజీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

నోట్‌బుక్‌లు, పెన్నులు తీసుకురావాలి

కడెం: అభిమానంతో నూతన సంవత్సరం శుభా కాంక్షలు చెప్పేందుకు తన వద్దకు వచ్చే వారు బొకేలు, శాలువాలు కాకుండా.. విద్యార్థులకు అవసరమైన నోట్‌బుక్‌లు, పెన్నులు తీసుకురావాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్‌లో తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కడెం మండలంలోని కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఈసందర్భంగా నోట్‌బుక్‌లు, పెన్నులు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి



బోథ్: బాలికల సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో..



నేరడిగొండ: నివాళులర్పిస్తున్న లెక్చరర్లు



బేల: నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు



తాంసిలో..

సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాయాలల్లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా సాధికారతకు ఆమె చేసిన సేవలను కొనియాడారు. బాలికల చదువు కోసం విద్యాలయాలు స్థాపించి బాలికల విద్యను ప్రోత్సహించారని గుర్తు చేశారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఆదిలాబాద్: నివాళులర్పిస్తున్న ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్



ఎదులాపురం: నివాళులర్పిస్తున్న నాయకులు



ఇంద్రవెల్లిలో..



ఇచ్చోడ: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



నార్నూర్: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



ఆదిలాబాద్‌టౌన్: నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



క్రీడాకారులతో కోచ్ సాయి

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడ పాఠశాలకు చెందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి సీఎం కప్ బాక్సింగ్ అండర్– 17 బాల, బాలికల పోటీల్లో ప్రతిభ కనబరిచారు. డిసెంబర్ 31 నుంచి జనవరి 2 వరకూ హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో నాలుగు పతకాలు సాధించారు. నిహారిక, వివేకవర్ధినిలు స్వర్ణ పతకాలతో సత్తా చాటగా, కె. అరుణ్ రజత పతకం, ఎస్. భగత్ కాంస్య పతకాలతో విజేతలుగా నిలిచారని కోచ్ సాయికుమార్ వెల్లడించారు. డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయేందర్, బేగ్, తదితరులు విద్యార్థులను అభినందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఆవరణలో పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఎంఈవో కిషన్ గుప్తా ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. మండల అధ్యక్షులు కటకం చంద్రకాంత్‌బాబు, విద్యాసాగర్, భూమన్న, దామోదర్, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, విజయ్‌శేఖర్, అనిత, లక్ష్మణ్, సదానందం పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శుక్రవారం పీఆర్టీయూ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి నరసింహాస్వామిలు ఆవిష్కరించారు. దేవురావు, నితిన్‌కుమార్, మదన్‌లాల్, స్వామి, భూమన్న పాల్గొన్నారు.

అలరించిన ఫుడ్ ఫెస్టివల్



వంటకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

తాంసి: మండలంలోని పొన్నారి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ అలరించింది. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండల నోడల్ అధికారి రాజశంకర్ ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల వంటకాలను ప్రదర్శించారు. స్వయంగా తయారు చేసిన స్వీట్లు, పిండి వంటకాలలతో పాటు చిరుధాన్యాల వంటలు స్టాళ్లలో ఉంచి విక్రయించారు. తోటి విద్యార్థులు, తల్లిదండ్రులు కొనుగోలు చేశారు. ఫుడ్ ఫెస్టివల్‌తో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కవిత, ఉపాధ్యాయురాలు సరితా, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాతంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పార్డి(బి) గ్రామ పంచాయతీ పరిధిలోని దేవుల్ నాయక్‌తండా గ్రామంలో నిర్వహించిన జగదాంబ దేవి జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. గత 35 ఏళ్లుగా జాతర నిర్వహించడంపై ఆలయ కమిటీ సభ్యులను, గ్రామస్తులను అభినందించారు.

ఆలయాన్ని అభివృద్ధికి కృషి..

జగదాంబ దేవి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. జగదాంబ దేవి జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వెంటనే నిర్మాణానికి సంబంధించి ప్రొసీడింగ్‌ను అందిస్తామన్నారు. కాగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెట్లపూజలో పాల్గొన్న జోగు రామన్న

ఆదిలాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శాంతినగర్‌లో శుక్రవారం నిర్వహించిన అయ్యప్ప స్వామి మెట్లపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మండల కాలం పాటు దీక్షాధారులు కఠిన నియమాలతో కూడిన దీక్షను ఆచరిస్తున్నారన్నారు. ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తూ ప్రశాంత జీవనాన్ని గడపాలన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న రైతులు

తలమడుగు: కాంగ్రెస్ ప్రభుత్వం షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలో వచ్చిన తర్వాత కొర్రీలతో అర్హులైన రైతులను మోసం చేసిందని ఆరోపించారు. ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో రూ. 2లక్షల రుణమాఫీ కాలేదన్నారు. రైతుభరోసా పథకంలో కూడా ఎలాంటి షరుతులు లేకుండా అందరికీ వర్తింప జేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్, పద్మాకర్ రెడ్డి, నరసింహులు, పోచన్న, ఉషన్న, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న డీఐఈవో రవీందర్

తలమడుగు: ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఐఈవో రవీందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా సంస్థ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. అనంతరం కళాశాలలోని విద్యార్థుల రిజిస్టర్, అధ్యాపకుల రిజిస్టర్లను పరిశీలించారు. పరీక్షలకు ఇప్పటి నుంచే సిద్ధం చేయాలని సూచించారు. సిలబస్ ఎంతవరకు పూర్తయిందని అడిగి తెలుసుకున్నారు. సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని ఆమె అడుగుజాడలో నడువాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుదర్శన్, అధ్యాపకులు లింగన్న, రమేశ్, పాపయ్య, సూర్యకాంత్, మహేశ్, రమాదేవి, సుభాష్, దినేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న హమాలీ కార్మికుల సమ్మె



నిరసన తెలుపుతున్న హమాలీ కార్మికులు

ఆదిలాబాద్‌టౌన్: హమాలీ కార్మికుల సమ్మె శుక్రవారంతో మూడో రోజుకు చేరింది. జైనథ్ మండల కేంద్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్ గౌడౌన్ వద్ద కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. వారికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ మద్దతు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపట్టడం జరిగిందన్నారు. గతంలో కమిషనర్ అంగీకరించి ఇప్పటి వరకు జీవో జారీ చేయకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలతో సహా ఒప్పంద జీవో విడుదల చేయాలన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలు

- త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం
- పంటలకు అందని సాగునీరు
- ఆందోళనలో రైతులు



సాగు చేస్తున్న మొక్కజొన్న

బోథ్: బోథ్ మండలంలో త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. పగలు అంతరాయం లేకుండా కరెంటు ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా.. మండలంలో మాత్రం అమలు కావడం లేదు. దీంతో రైతుల తమ పంటలకు సాగునీరు అందించలేకపోతున్నారు. ఇలాగే మరో వారం రోజులు గడిస్తే పంటలు ఎండిపోయే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగలు కనీసం ఆరు నుంచి ఎనిమిది గంటలు కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

పంటలు ఎండిపోయే అవకాశం..

గత వారం రోజులుగా త్రీఫేజ్ విద్యుత్‌లో అంతరాయం కారణంగా రైతులు తమ పంటలకు నీరందించే అవకాశం లేకుండా పోయింది. అప్రకటిత కోతలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పగటి పూట కనీసం రెండు గంటలు కూడా విద్యుత్ సరఫరా చేయడం లేదని వాపోతున్నారు. పగలు ఎనిమిది గంటల నుంచి 12 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తేనే పంటలు ఎండిపోకుండా ఉంటాయని, లేదంటే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు పేర్కొంటున్నారు. అసలు కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియడం లేదని, చేనుల్లోనే రాత్రి వరకు ఉంటున్నామని రైతులు పేర్కొంటున్నారు.

రాత్రి చేనులకు వెళ్లడం ఇబ్బంది..

బోథ్ మండలంలో ప్రస్తుతం శనగ, మొక్కజొన్న, జొన్న, ఆవ, ధనియాలను ఎక్కువగా పండిస్తున్నారు. ఈ పంటలకు నీరు అందకపోతే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. దీంతో దిగుబడి రాక నష్టపోయే ప్రమాదం ఉందని వారు పేర్కొంటున్నారు. చేను నుంచి సాయంత్రం ఇంటికి వచ్చే సమయంలో కరెంటు ఇస్తున్నారని, దీంతో మళ్లీ చేనుల్లోకే వెళ్లి బోరు మోటారును ఆన్ చేసి వస్తున్నామని రైతులు వాపోతున్నారు. మళ్లీ రాత్రి 8 గంటలకు కరెంటు సరఫరాను నిలిపివేసి, రాత్రి 11 గంటలకు ఇస్తున్నారని పేర్కొంటున్నారు. దీంతో రాత్రుల్లో చేలల్లోకి వెళ్లడం ఇబ్బందిగా మారిందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

పంటలు ఎండుతున్నాయి



బోథ్ సబ్‌స్టేషన్ పరిధిలో త్రీఫేజ్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. పంటలకు కనీసం నాలుగు గంటలు కూడా విద్యుత్ సరఫరా చేయడం లేదు. ఉదయం నుంచి రాత్రి వరకు వారం రోజులుగా రెండు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా ఉంది. పంటలు ఎండిపోయే స్థితికి వచ్చాయి.

– రాసం ప్రవీణ్ కుమార్, రైతు, బోథ్

అధికారులు పట్టించుకోవడం లేదు



త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. విద్యుత్ అధికారులకు అడుగుదామంటే వారి నుంచి స్పందన ఉండటం లేదు. కరెంటు ఎప్పుడు వస్తుందో? ఎప్పుడు పోతుందో తెలియడం లేదు. రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వడం లేదు.

– మల్లెపూల మహేందర్, రైతు, బోథ్

ఉత్తమ సేవలకు ప్రశంస



ప్రశంసాపత్రాలు అందిస్తున్న సభ్యులు

ఖానాపూర్: దశాబ్దాలుగా అన్ని వర్గాల ప్రజలకు ఖానాపూర్ నాయకులు సామాజిక సేవలు అందించడం అభినందనీయమని నార్వాడే గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నైతం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతిభవనం ఆవరణలో నార్వాడే గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలానికి చెందిన నాయకులు నంది రామయ్య, అంకుశ్‌రావు, జక్కుల రాజన్నలకు ×ఎక్సెలెంట్ సోషల్ వర్క్–2024 ఉత్తమ ప్రశంసాపత్రాలు అందజేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటేశ్, మండలాధ్యక్షుడు ములంకల మురళి తదితరులు ఉన్నారు.

ఎస్పీని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఎస్పీని సన్మానిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఎస్పీ గౌస్ ఆలంను మర్యాద పూర్వకంగా కలిశారు. తన క్యాంపు కార్యాలయంలో ఎస్పీని కలిసిన నాయకులు శాలువా సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సామ రూపేష్ రెడ్డి, వేముల నాగరాజు, రంజిత్ రెడ్డి, ఫిరోజ్ పాల్గొన్నారు.

- సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలోనూ జిల్లా ఎస్పీ గౌస్ అలం, ఉట్నూర్ ఎఎస్పీ కాజల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రమోద్ కుమార్ ఖత్రి, రేనికుంట్ల రవీందర్, సూర్యకాంత్, కందుల రవీందర్, ఉరడే సుభాష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన పెద్ద భీమన్న ఇటీవల సోలార్ కరెంట్ షాక్‌తో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ పరామర్శించారు. ఈసందర్భంగా మృతికి కారణాలను మృతుడి అల్లుడు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దయానంద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పుప్పాల శంకర్, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్, నాయకులు వేల్పుల రమేశ్ తదితరులు ఉన్నారు.

టీబీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న వైద్యురాలు పూజిత

ఇంద్రవెల్లి: టీబీ రహిత సమాజ నిర్మాణానికి నిర్మిద్దామని వైద్యాధికారి పూజిత అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వంద రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు టీబీపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. క్షయవ్యాధిపై తల్లిదండ్రులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పవార్ సురేశ్, టీబీ సూపర్ వైజర్ వెంకటేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.